క్లుప్తంగా

నేడు కట్లమ్మ తల్లి జాతర

బిక్కవోలు: పందలపాక గ్రామంలోని కొలువైన ఉన్న కట్లమ్మ తల్లి అమ్మవారి జాతర ఆదివారం నుంచి ప్రారంభంకానుంది. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయనున్నారు. 12 తీర్థం నిర్వహించడానికి ఆలయ కమిటీ సభ్యులు అన్ని ఏర్పాటు చేశారు. 3 ఏళ్ల తరువాత నిర్వహిస్తున్న ఈ పండగను వినూత్ని రీతిలో చేసేలా ముందుస్తు ప్రణాళిక తయారు చేశారు. గ్రామదేవత కావడంతో గ్రామస్తులు అందరూ కలిసి ఏకాదాటిగా ఎప్పుడు లేనంతగా ఈసారి వైభవరం చేసేందుకు ఏర్పాట్లు సాగుతున్నారు. ఆదివారం రాత్రి గరక నృత్యాలు, డప్పులు మేళాలు, గారడీలు, కాళీమాత వేష ధారణలు, తీన్మార్, బాణసంచా కార్యక్రమాలు ఉంటాయి. ముందు అమ్మవారి గరగ నృత్యాలు నడుమ చిన్నారులు కాగడ హారతులు ఇస్తారు. అనంతరం గ్రామంలోని గ్రామోత్సవం చేస్తారు. ఇప్పటికే గ్రామంలోని ఆడపచులు రావడంతో సందడి వాతవరణ నెలకొంది. ఎలాంటి అసాంఘిక సంఘటన జరగకుండా ముందుస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్సై వాసంశెట్టి రవిచంద్రకుమార్ తెలిపారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు


ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామి

బిక్కవోలు: గ్రామంలోని పార్కు వీధిలో కొలువైన ఉన్న శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవాలు భాగంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు శనివారం ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన


ఆలయ పనులను పరిశీలిస్తున్న దుర్గేష్

అనపర్తి: రామవరం గ్రామంలో పునర్నిర్మిస్తున్న రామలింగేశ్వరస్వామి వారి ఆలయ పనులను దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ తోట దుర్గేష్ శనివారం పరిశీలించారు. సుమారు రూ.1.50కోట్లతో చేపడుతున్న ఆలయ అభివృద్ధి పనులను గ్రామ పెద్దలతో కలసి పరిశీలించిన ఆయన కార్యనిర్వాహణాధికారి ఆకేళ్ల భాస్కర్‌కు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం


పూజిత

రంగంపేట: వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు అందినట్లు హెడ్ కానిస్టేబుల్ కేవీఎస్ నారాయణ తెలిపారు. శనివారం రాత్రి ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండల పరిధిలోని ఈలకొలను గ్రామానికి చెందిన కురుకూరి పూజిత(24) అదే గ్రామానికి చెందిన లైటింగ్ పని చేసే మూగ వాడైన శివయ్యతో వివాహమైంది. వారికి ఒక పాప కూడా ఉంది. ఈనెల 9వ తేదీ రాత్రి అందరూ పడుకున్నారు. తెల్లవారే సరికి అత్త అనంత లక్ష్మీ చూడగా పూజిత కనిపించలేదు. చుట్టు పక్కల, బంధువుల ఇళ్ల వద్ద గాలించారు. కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించారు. పూజిత అత్త అనంతలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామన్నారు. ఆచూకీ తెలిసిన వారు అనపర్తి సీఐ 94407 96538, రంగంపేట ఎస్‌ఐ 94409 04854 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

పాత్రికేయులపై దాడులు అప్రజాస్వామికం

రాజమహేంద్రవరం సిటీ: నరసరావుపేట జిల్లా వినుకొండ మున్సిపాలిటీలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అవినీతి కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు చోద్యం చూస్తున్నారని జర్నలిస్ట్ డెమోక్రటిక్ రైట్స్ ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం రాజమహేంద్రవరంలో మాట్లాడుతూ వినుకొండ టౌన్ ప్లానింగ్ విభాగంలో ఒక అధికారి భూ మాఫియా ముఠాలతో సత్సంబంధాలు పెట్టుకుని అక్రమ నిర్మాణంపై వార్త రాసిన విలేకరిపై దౌర్జన్యం చేయిస్తున్నారని ఇది సరైన విధానం కాదని ధ్వజమెత్తారు. ఈ మధ్యకాలంలో వాస్తవాలు గురించి వార్తలు రాస్తున్న విలేకరులను బెదిరింపులకు గురి చేయడం అధికారులకు అలవాటుగా మారిపోయిందన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు అవినీతి అధికారులకు ఇస్తున్న ప్రాధాన్యత విలేకరులకు ఇవ్వకపోవడం శోచనీయమన్నారు. వినుకొండ టౌన్ ప్లానింగ్‌లోని అవినీతి అధికారులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయాలని, వినుకొండ మున్సిపాలిటీలో అవినీతి అనకొండలను గుర్తించి, వారిని బదిలీలు చేయాలని, మున్సిపాలిటీలో అవినీతిపై దృష్టి సారించాలని, అక్రమ ఆస్తులను ప్రభుత్వం జప్తు చేయాలని శ్రీనివాస్ ప్రభుత్వాన్ని కోరారు.

అమ్మకు ప్రేమతో...



- అమ్మకు వందనం చేద్దాం
- నేడు మదర్స్ డే

బిక్కవోలు: అందమైన అనుబంధం, అంతులేని అనురాగానికి అర్థం అమ్మ. ఆమె మమతకు మారుపేరు. కల్మషం లేని ప్రేమకు పత్రిరూపం. ఆమె రూపం అపురూపం. ఈ సృష్టికి మూలం అమ్మ. అడగకుండానే అన్నీ ఇస్తుంది. అటువంటి మాతృమూర్తి గొప్పతనం గురించి ఎంతచెప్పినా తక్కువే. తల్లి ప్రాధాన్యాన్ని గుర్తించి చెప్పుకోవడానికి ఓ రోజు ఉండాలని అమెరికా అధ్యక్షుడు ఉడ్రోవిల్సన్ 1914లో ఏటా మే నెల రెండో ఆదివారాన్ని అంతర్జాతీయ మాతృమూర్తి దినోత్సవంగా ప్రకటించారు. ఆ రోజున జాతీయ సెలవుదినంగా పేర్కొన్నారు. అమ్మ తోడ్పాటు, అమ్మ ఆసరాతో ఉన్నత పదవులు చేపట్టిన వారెందరో ఉన్నారు. అమ్మతోడు లేకుండా ఏ ప్రాణీ ఉండదు. అయితే ఈ ఆధునిక కాలంలో చాలా మంది ఉద్యోగాలని వెళుతూ తల్లిదండ్రులను పట్టించుకోవడంలేదు. అనాథ శారణాలయాల్లోనూ, వృద్ధాశ్రమాల్లోనూ పెడుతున్నారు. అలా కాకుండా జన్మనిచ్చిన తల్లిని కళ్లలో పెట్టుకుచూసుకోవాలన్నదే ఈ దినోత్సవం ప్రధానుద్దేశ్యం. ఎప్పుడూ చదువు సంధ్యలతో ఉండే చిన్నారులకు మాతృ దినోత్సవాన్ని అమ్మతో హాయిగా గడిపే వీలుంది. ఇంకెందుకు ఆలస్యం.. అమ్మకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలపండి. నియోజకవర్గంలోని అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల్లో కాబోయే అమ్మగా సుమారు 2,435 మంది గర్భిణులు ఉన్నారు.

అమ్మ ప్రోత్సాహంతో ఈ స్థాయికి..



మా అమ్మ మంగ మ్యాణకంబ ప్రోత్సాహంతోనే ఉన్నత స్థాయికి ఎదిగాను.అపాయ్యతగా చూసుకునే వారు ఎలాగైనా ప్రభుత్వం ఉద్యోగం సాధించాలన్న లక్ష్యంతో తహసీల్దార్ స్థాయి ఉద్యోగం సాధించాను. ఇంకా ఉన్నత స్థాయికి ఎదిగి అమ్మ ఆశ నెరవేర్చడానికి నిరంతరం కష్టపడుతున్నాను.

– బీఎస్‌వీవీ కృష్ణ, తహసీల్దార్, బిక్కవోలు

అడగక ముందే అన్ని ఇచ్చేది



అంతులేని ప్రేమకు అమ్మ నిర్వచనం. అడగక ముందే అన్ని ఇచ్చేది. పిల్లల ఆనందాన్నే తన సంతోషంగా భావిస్తుంది. నేను ఈ స్థాయికి ఎదగడానికి మా అమ్మ గంగా భవాని కారణం. నాన్న ఆర్థిక వనరులు అన్నీ సమకూర్చినా అమ్మ ప్రోత్సాహం గురించి ఎంత చెప్పినా తక్కువే.

– వాసంశెట్టి రవిచంద్ర కుమార్, ఎస్సై, బిక్కవోలు

అమ్మ గురించి మాటల్లో చెప్పలేం



అమ్మకి ఒక రోజు కాదు. నిత్యం అమ్మ రోజు అనే చెప్పాలి. మనిషి జీవితం అమ్మతో ప్రారంభంవుంది. మన ఏమి చేసినా సరిదిద్దుకుంటూ మన ఎదుగుదల ఆమె కళ్లలో చూసుకుంటుంది. మా అమ్మకి ఐదు సంతానం. నేను రెండో సంతానం. అందరం ఇప్పటికీ మా అమ్మ మాట వింటాం.

– వి.శ్రీనివాస్ ఎంపీడీవో బిక్కవోలు

మొలకలున్న ధాన్యం కొనుగోలు చేస్తాం


బలభద్రపురంలో తడిసిన ధాన్యం పరిశీలిస్తున్న శ్రీధర్

బిక్కవోలు: వర్షాలకు ధాన్యం తడిసిందని రైతులు అధైర్య పడాల్సిన అవసరం లేదని, మొక్కలు మొలిచిన ధ్యానం కొనుగోలు చేస్తాం అని సివిల్ సప్లయిస్ చైర్మన్ తోట శ్రీధర్ అన్నారు. శనివారం ఆయన బలభద్రపురం గ్రామంలోని రైతులు ఆరబెట్టిన ధాన్యం పంటను పరిశీలించారు. దీంతో రైతులు వర్షాలు ధాన్యం తడిసిపోయింది. మొక్కలు కూడా వస్తుంది వీటినీ అమ్మకం చాలా ఇబ్బందిగా ఉందని ఆయన దృష్టి తీసుకువచ్చారు. ఆయన మాట్లాడుతూ రైతులు కంగారు పడాల్సిన అవసరం లేదని తడిసిన, మొక్క మొలిచినా ప్రభుత్వం మద్దతు ధర కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ డియం రాధిక, తహసీల్దార్ బీఎస్‌వీవీ కృష్ణ, ఏవో శామ్యూల్ జాన్, వీఆర్వో మచవరపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సీహెచ్‌ఓల నిరసన

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా కలెక్టరేట్ వద్ద ఏపీమిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు అసోసియేషన్ ఆధ్వర్యంలో సీహెచ్‌ఓల చేపడుతున్న నిరవధిక సమ్మె శనివారం 13వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సీహెచ్‌ఓలు ఒంటికాలిపై నిలుచుని నిరసన తెలిపారు. అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు టి.మమత మాట్లాడుతూ ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న సీహెచ్‌ఓలను క్రమబద్ధీకరించాలని, విలేజ్ క్లినిక్ అద్దెబకాయిలు, విద్యుత్ బిల్లులను వెంటనే చెల్లించాలని, తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు నిరవధిక సమ్మె కొనసాగుతుందని మమత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన సీహెచ్‌ఓలు పాల్గొన్నారు.

107, 108 జీవోలను రద్దు చేయాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): పేద విద్యార్థులకు విద్యను దూరం చేసే 107, 108 జీవోలను రద్దు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఏఐఎస్‌ఎఫ్ తూర్పుగోదావరి జిల్లా సమితి శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ మాట్లాడుతూ ఎన్నికలలో ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలు పీజీ విద్యార్థులకు శాపంగా మారాయని, జీవో నంబర్ 77 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విద్యారంగ సమస్యలకు అడ్డుగా ఉన్న జీవోలను రద్దు చేస్తామని, ప్రతి పేద విద్యార్థికి వైద్య విద్యను అందేలా చూస్తామని హామీ ఇచ్చి ఆ సంగతి మర్చారన్నారు. తక్షణమే పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసే జీవో నంబర్ 107, 108 రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా డిగ్రీ ఇంజినీరింగ్ పీజీ చదువుతున్న విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, వసతి దీవెన బకాయిలు తక్షణమే విడుదల చేయాలన్నారు. తూతూ మంత్రంగా రూ.788 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసి చేతులు దులుపుకుందని, మాకు కావాల్సింది రూ.788 కోట్లు కాదని రూ.3580 కోట్లు విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతలపూడి సునీల్, జిల్లా ఉపాధ్యక్షుడు కే.శ్రీనివాస్, ఈతఈ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికి వస్తే ఊరుకోం

- వారికి వైఎస్సార్ సీపీ అండగా ఉంటుంది
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరిక


పెదపూడిలో పంపన వెంకటరమణను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: తన కార్యకర్తల జోలికి వస్తే చూస్తూ ఊరుకునేదిలేదని, తగిన బుద్ధి చెబుతామని, ఎప్పుడూ కార్యకర్తలకు వైఎస్సార్ సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఈ నెల ఒకటో తేదీన మండల కేంద్రమైన పెదపూడిలో మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై ఎన్డీఏ కూటమి గూండాలు హత్యాయత్నానికి ప్రయత్నించారు. ఆ ఘటనలో పెదపూడి గ్రామానికి చెందిన పార్టీ నేత, గ్రామ పంచాయతీ పాలకమండలి సభ్యుడు పంపన వెంకటరమణపై టీడీపీ గూండాలు దాడికి పాల్పడ్డారు. దీనిపై మాజీ ఎమ్మెల్యే శనివారం వెంకటరమణను పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంత మంది రౌడీలను పంపించి తన పైన, తన కార్యకర్తలపై దాడులకు ప్రయత్నిస్తే వెనక్కి తగ్గేదలే అంటూ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని హెచ్చరించారు. తనపై హత్యాయత్నం దాడిలో కూటమి గూండాలకు తగిన శిక్ష పడేవిధంగా పోరాడాతనన్నారు. మళ్లీ వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం వచ్చాక తనపైన, తన కార్యకర్తలపైన దౌర్జన్యంగా దాడులకు పాల్పడిన వారిపై తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ముందుకు సాగాలన్నారు. అక్రమాలు, కక్షసాధింపు, దౌర్జన్యాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డికి త్వరలోనే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గుత్తుల రమణ, సర్పంచులు మీనవల్లి శారదదేవి, డొకుబుర్ర మీనాక్షి, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, పార్టీ నాయకులు కాకర సాయిబాబు, మార్ని వెంకట్రావు, పందిరి సూర్యప్రకాశ్, చేవా సత్యనారాయణ, కొంగర దొరబాబు, భద్రం, నర్ల శ్రీను, గార్లపాటి అశోక్, పప్పు జానకి రామయ్య, ఇండిగపల్లి కాటయ్య, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం

- సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల


సీతానగరంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి వీరబాబు

సీతానగరం: క్రీడలు వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహతపడతాయిన సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు అన్నారు. శనివారం సీతానగరం డిగ్రీ కళాశాలలో నియోజకవర్గం స్థాయి సాయి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ యువత క్రీడల వైపు మొగ్గు చూపి శారీరకంగా, మానసింకంగా అభివృద్ధి చెందాలని, క్రీడలో మానసిక ప్రశాంతత కలుగుతుందన్నారు. క్రీడలతోనే జీవితంలో ఆటుపోటులను ఎదుర్కొనే శక్తి కలుగుతుందన్నారు. టోర్నమెంట్ నిర్వహణకు తన వంతుగా రూ.50 వేలు ఆర్థిక సహాయం అందిస్తామని ఆయన ప్రకటించారు. అనంతరం టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు, క్రీడాకారులు, ప్రజలు పాల్గొన్నారు.

భారత సైన్యం కోసం ప్రత్యేక పూజలు


వెదుళ్లపల్లి వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

సీతానగరం: భారత సైన్యానికి, దేశ ప్రధాని నరేంద్ర మోదీకి భగవంతుని ఆశీస్సులు కలగాలని వెదుళ్లపల్లి వినాయకుని ఆలయంలో బీజేపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం వెదుళ్లపల్లి నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్రావు, సీనియర్ నాయకులు ఏపీఆర్ చౌదరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గం ఇన్‌చార్జి వీరన్న చౌదరి మాట్లాడుతూ దేశ రక్షణ కోసం అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు రాపాక వెంకటలక్ష్మి, మద్దాల కొండల రావి, గూడపాటి జయరాం, పెరుగు శ్రీను, గేదెల శ్రీను, మట్టాడి రమణ, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

రాజానగరం: నరేంద్రపురంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో బీజేపీ మండల కమిటీ అధ్యక్షుడు ఆళ్ల శివనాగరాజు ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక పూజలు జరిగాయి. భారత్-పాకిస్తాన్ దేశాల మధ్య జరుగుతున్న యుద్ధంలో భారత్ విజయం సాధించాలనే ఆకాంక్షతోపాటు యుద్ధంలో భారత్ సైనికుల అండగా నిలవాలని ఆ స్వామిని కోరుతూ ఈ పూజలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తంగెళ్ల ముసలయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

వేధింపులపై కేసు

సీతానగరం: వంగలపూడికి చెందిన యర్రమల్ల నాగదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు గోకవరానికి చెందిన ఆమె భర్త యర్రమల్ల శివ ప్రసాద్, అత్త మామలుపై వరకట్నం కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... వంగలపూడికి చెందిన నాగదుర్గకు 2020లో గోకవరానికి చెందిన శివ ప్రసాద్‌తో వివాహమైంది. అధిక వరకట్నం తీసుకురావాలంటూ మానసికంగా, శారీరంకంగా భర్త శివ ప్రసాద్, అత్త అన్నవరం, మావయ్య సుబ్బారావు వేధిస్తున్నారని నాగదుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కొండను పిండేస్తున్నారు..!

- నల్గొండలో అక్రమంగా ఎర్రమట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు


నల్గొండ వద్ద తవ్వేస్తున్న కొండ

సీతానగరం: కూటమి ప్రభుత్వంలో కొండలను పిండి చేసేస్తున్నారు. ఇసుక, మట్టి, ఎర్రమట్టి అక్రమ తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. మండలంలోని నల్గొండ సమీపంలోని కొండలను అక్రమంగా తవ్వి లక్షల రూపాలయకు విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా పొక్లెయిన్‌లతో తవ్వకాలు జరుపుతూ గ్రామాల్లో అధిక రేట్లకు అమ్మకాలు జరుపుతున్నారు. కొండలను తవ్వేసి ఎర్రమట్టిని లారీలతో రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను సంరక్షించే అధికారులు మత్తు నిద్రలో ఉంటున్నారు. చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఇలా వదిలేసేత రెండేళ్లలో కొండలు కనుమరుగు అయ్యే అవకాశం ఉంది. అధిక వేగంతో లారీలు, ట్రాక్టర్లు వెళ్లడంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. ఏ ప్రమాదం జరుగుతుందోనని భయ భ్రాంతులకు గురవుతున్నారు. అధికారులు మాత్రం కన్నెత్తి చూడకపోవడంతో రాజకీయ ఒత్తిడులు ఉన్నాయా లేక మామూళ్ల మత్తులో ఉంటూ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శిస్తున్నారు. తహసీల్దార్ ఎ.శ్రీనివాస్‌ను వివరణ కోరగా అక్రమ రవాణ విషయం తన దృష్టికి రాలేదని, తక్షణమే వీఆర్వోను పంపించి తవ్వకాలు నిలిపివేస్తామని అన్నారు.

పొలంలో నిప్పు.. ఎంతో ముప్పే

- పొలంలోకి గడ్డికి నిప్పు పెడుతున్న రైతులు
- వరికుప్పలకు అంటుకుంటున్న వైనం
- వేసవిలో జరుగుతున్న అగ్ని ప్రమాదాలు
- నష్టపోతున్న రైతులు


పంట పొలాల్లో వేసిన వరికుప్పలు


పొలంలో మొక్కజొన్న చెత్తకు నిప్పు పెట్టిన రైతులు

సీతానగరం: ప్రకృతి వైపరిత్యాల వల్లే కాదు మనుషుల తప్పిదాల వల్ల కూడా రైతులు నష్టపోతున్నారు. రైతులే కాదు భూమికి కూడా నష్టం కలుగుతోంది. ప్రస్తుతం రైతులు ఖరీఫ్, రబీ పంట కోతలు మాసూళ్ల పూర్తి చేసుకున్నారు. కొంత మంది యంత్రాలతో మాసూళ్లను చేపట్టారు. దీంతో వరి గడ్డి చిన్న చిన్నగా కట్ అయిపోవడంతో దానిని మడుల్లోనే వదిలేశారు. అయితే గడ్డిని అలాగే వదిలేయకుండా రైతులు వాటికి నిప్పు అంటించి కాల్చుతున్నారు. ఇలా చేయడం వల్ల భూసారం కోల్పోతోంది. అంతేకాకుండా ఆ నిప్పు రవ్వలు పక్కన ఉన్న వరి కుప్పలపై పడడంతో అవి అగ్నికి ఆహుదవుతున్నాయి. దీంతో ఆ రైతులు తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. ఇలా వరికుప్పలు అగ్నిప్రమాదంలో కాలిపోయిన సంఘటనలు గతంలో చాలా జరిగాయి.

మండలంలో ఖరీఫ్‌లో పండించిన వరి అయిదు వేల ఎకరాలు వరకు వరి కుప్పలు వేశారు. ఏప్రిల్ నెలాఖరు, మే నెలల్లో వరికుప్పలను నూర్పిళ్ల చేసి ధాన్యాన్ని విక్రయించారు. అయితే ఈ నూర్పిళ్ల తత్వాత వచ్చిన రద్దు, ఆరుతడి పంటలు అనంతరం కొంత మంది రైతులు తమ పొలంలోని మొక్కజొన్న, తదితర పంటల చెత్తకు నిప్పు పెడుతుంటారు. దీనితో సరిహద్దులలో ఉన్న వరికుప్పలకు మంటలు వ్యాపించిన సంఘటనలు ఉన్నాయి.

ఎండలకు అగ్ని ప్రమాదాలు

మే నెలలో వాతావరణంలో మార్పులతో గాలి, వానలు, అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయి. పొలాల్లో చెత్తకు నిప్పు పెట్టే సమయంలో సంబంధిత రైతులు దగ్గర ఉండి వరికుప్పలకు ఎటువంటి ప్రమాదం జరగకుండా తగు చర్యలు తీసుకొని చెత్తకు నిప్పు పెట్టాలి. పశువుల కాపలాదారుల వల్ల పలు రకాల తప్పిదాలతో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. పొలాల్లో పంట రద్దుకు నిప్పు పెట్టే సమయంలో జరిగే తప్పిదాలతో వరికుప్పలు అగ్నిప్రమాదాలకు గురవుతున్నాయి. వరికుప్పలు పొలాలలో గ్రామానికి దూరంగా ఉండడంతో ఏ విధమైన ప్రమాదం జరిగినా సమాచారం రైతులకు ఆలస్యంగా తెలుస్తోంది. అప్పటికే నష్టం తీవ్రస్థాయిలో ఉంటుంది.

అగ్నిమాపక కేంద్రం దూరమై..

మండల గ్రామాల్లో జరిగే అగ్నిప్రమాదాల నివారణకు అగ్నిమాపక కేంద్రం రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక శకటం రావాల్సి ఉంటుంది. అవి దూరంగా ఉండడంతో ప్రమాద స్థలానికి వాహనాలు చేరుకునే సమయానికి జరగాల్సిన నష్టం జరిగిపోతోంది. గత మూడేళ్ల క్రితం రాజమహేంద్రవరం నుంచి అగ్నిమాపక శకటం వచ్చేది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కృషి ఫలితంగా కోరుకొండలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు ఊపిరిపీల్చుకున్నారు. సీతానగరం మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు నివేదికలు పంపించారు. సీతానగరం మండలంలో అగ్నిమాపక కేంద్రం ఉంటే ప్రమాదం జరిగిన తక్షణమే సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదాన్ని నివారించవచ్చు. మండలానికి అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

భయం భయంగా..



ఐదు ఎకరాలు ఖరీఫ్‌లో వరి పంటను కుప్పలు వేసి ఉంచాను. దాళ్వాలో పంటను మిషన్‌తో కోతలు జరిపి ధాన్యం అమ్మకాలు జరిపాను. పొలంలో ఉన్న వరి కుప్పలు గాలిలో దీపంలా ఉన్నాయి. ఏ సమయంలో అగ్ని ప్రమాదాలు జరుగుతాయో అనే భయాందోళనలో ఉన్నా. రోజూ పొలం వెళ్లి కాపలా కాయాల్సి వస్తోంది. ఉపాధి పనులతో కూలీల కొరత ఎక్కువగా ఉంది. మండలంలో అగ్నిమాపక కేంద్రం ఉంటే బాగుంటుంది.

– గద్దె వీరన్నబాబు, రైతు, రామచంద్రపురం

జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో భయపడాల్సి వస్తోంది. ఎప్పుడు అగ్ని ప్రమాదాలు జరుగుతాయోనని. పక్క రైతులు మొక్కజొన్న తుక్కుకు నిప్పు పెట్టే సమయంలో వరికుప్పలకు అంటుకుని అగ్నిప్రమాదం జరిగే అవకాశం ఉంది. రైతులు మొక్కజొన్న తుక్కుకు నిప్పు పెట్టే సమయంలో పక్కనే ఉన్న వరికుప్పల రైతులకు సమాచారం ఇవ్వాలి. వారి అక్కడ కాపలాగా ఉంటారు. ప్రమాదాన్ని కాస్త తగ్గించుకోవచ్చు. మండలంలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేస్తే రైతులకు, ప్రజలకు ఎంతో ఉపయోగం.

– ముదునూరి రామకృష్ణంరాజు, రైతు, చినకొండేపూడి

ఉగ్రవాదం నశించాలంటూ ముస్లింల ర్యాలీ


వేమగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లింలు

కడియం: ప్రపంచ వ్యాప్తంగా వ్యతిరేకిస్తున్న ఉగ్రవాదాన్ని నిర్మూలించాలంటూ వేమగిరికి చెందిన ముస్లింలు శనివారం భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. వందల సంఖ్యలో ముస్లింలు వేమగిరి జంక్షన్ చేరుకుని ఉగ్రవాదానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ ఉగ్రవాదులను పెంచి పోషిస్తున్న పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ ఇండియాకు జేజేలు పలికారు. ఈ సందర్భంగా ముస్లిం నాయకులు షేక్ బాబ్జి, అబ్దుల్లా, మస్తాన్, వల్లి మాట్లాడుతూ భారత ప్రభుత్వం చేపడుతున్న ఆపరేషన్ సింధూర సక్సెస్ అవ్వాలన్నారు. మతాలకు అతీతంగా ఉగ్రవాదాన్ని నిర్మించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా కడియం ఇన్‌స్పెక్టర్ అల్లు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

దేశ క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేశ క్షేమం కోసం రాజమండ్రి బైబిలు మిషను కెథెడ్రల్ మందిరంలో మాజీ ఐఏఎఫ్, బైబిలు మిషను ప్రెసిడెంట్ బిషప్ డాక్టర్ ఎన్.విజయరాజు అధ్యక్షతన శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. యుద్ధ సమయంలో సైనికులకు అండగా నిలబడి దేశ క్షేమం, సైనికుల క్షేమం దేశ ప్రజలందరి క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా విజయరాజు మాట్లాడుతూ తాను 12 సంవత్సరాలు భారత వైమానిక దళంలో సేవలందించిన నేపథ్యంలో బోర్డర్‌లో యుద్ధం తీవ్రత అనంతరం పర్యవసానాలు ఏ విధంగా ఉంటాయో అనుభవ పూర్వకంగా తెలియజేశారు. భారత దేశ రక్షణ కోసం సరిహద్దులో త్రివిధ దళాల సైనికులు రేయింబవళ్లు ప్రయాసపడుతున్నారని తెలిపారు. సైనికుల క్షేమం, దేశ రక్షణకు అందరూ ప్రార్థించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవ. డా.ఎస్.సిమ్యోన్ సుదర్శన్, రెవ.ఎన్.విలియం బెంటిక్, దైవం సేవకురాలు ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.